# పద్మవ్యూహం

రిక్షా ఆపి తలయెత్తి ఆకాశంలోకి చూశాడతడు. శుభ్ర కాసారంలో తేలుతున్న అందాల కలువపువ్వులా వుంది ఆకాశంలో చంద్రబింబం.

"వర్షం రాకపోతే బాగుండును. నాలుగు బాడిగలు దొరికితే రేపటికి దిగులుండదు" అనుకున్నాడు. బహుశా వర్షం రాకపోవచ్చు. కాని ఖచ్చితంగా ఏమీచెప్పలేము. ఒక్క మబ్బుతునక అయినా లేకుండా ప్రశాంతంగా వున్న ఆకాశంలో క్షణాలమీద నల్లని మదపుటేనుగులవంటి మబ్బులు గుమికూడి గర్జించవచ్చు. కసిగా వర్షించవచ్చు. అప్పుడీ చంద్రబింబం కలలాగా కరిగిపోతుంది.

"ఏయ్ రిక్షా!"

"వస్తున్నా బాబూ!"

రవీంద్ర చేతిలో కాగితాల ఫైలుతో రోడ్డుకవతల నిలబడ్డాడు. రిక్షా రాగానే యెక్కి 'పోనియ్' అన్నాడు. రిక్షా కదిలింది.

*　　*　　*

రవీంద్ర చేతిలో ఉన్నవి అతని సర్వస్వం. స్కూల్ ఫైనల్ రిజిస్టర్‌తో సహా-ఎం. ఏ. వరకూ మొత్తం సర్టిఫికెట్లు.... మార్కులలిస్టులు. టెస్టిమోనియల్స్.... వాటికి ట్రూ కాపీలు.... తాను వివిధ పత్రికలలో అప్పుడప్పుడు చేసిన రచనలు.... వగైరాలు....

అలిసిన కళ్ళమీద పడుతున్న జుట్టును ఒకచేత్తో పైకి తోసుకుని రవీంద్ర ఆలోచనలో పడ్డాడు. ఇంటిదగ్గర అక్కయ్య కళ్ళనిండా ఆశ నింపుకుని తనకోసం యెదురుచూస్తూ వుంటుంది. చిన్నతనంలోనే భర్తను పోగొట్టుకుని తల్లిదండ్రులు లేని తనను కళ్ళలో పెట్టుకుని పెంచిన

అక్కయ్య! తన చదువుకోసం, నిరంతరం చాకిరీ చేసిచేసి జీవితాన్ని కరిగించుకున్న అక్కయ్య!

తాను వెళ్ళి ఆమెకు ఏం చెబుతాడు? అన్ని ఇంటర్వ్యూలలాగే యిదీ చట్టుబండలయిందని విన్నప్పుడు ఆమె ముఖ మెలా చూడగలడు? రవీంద్ర నుదురు చేతో రుద్దుకున్నాడు.

ఆ కాలేజీలో తెలుగులో ఉన్నది ఒక్కటే ఖాళీ. వచ్చినవారు మొత్తం నలభై ఒక్కమంది. మిగిలిన సబ్జక్టులూ అంతే.... ఉదయం అక్కడి వాతావరణంచూసి అయిదారుగురు వచ్చిన దారినే వెళ్ళిపోయారు. మిగిలినవారు అంతరంగంలో ఏదో పలుచని ఆశాకిరణంతో ఉండిపోయారు. అందులో మామూలు పోస్టుగ్రాడ్యుయేట్లే కాక బి.యిడి.లు, డాక్టరేట్‌లు పొందినవారు కూడా కొందరున్నారు. ఎవరికేమి అర్హతలున్నా అంత మందిలోనూ ఆ అదృష్టవంతులెవరో ఆపాటికే నిర్ణయించబడి వుంటారు.

ఆ ఉదయంనుంచీ అభ్యర్థులందరూ చేతుల్లో కవిలెకట్టలతో వరండాల్లో పడిగాపులు పడివున్నారు. అందరూ రకరకాల దుస్తులు ధరించి వచ్చారు. రవీంద్ర వరండాలో గోడకానుకుని నిలబడి అందర్నీ పరిశీలించాడు. కాస్సేపాగి ఏమీ తోచక చేతివ్రేళ్ళు విరుచుకున్నాడు. తర్వాత ఆ వరండాలో వున్న వారందరినీ వర్గాల వారీగా విభజించాడు. పూర్తి సూటు వేసుకుని వచ్చినవారు నలుగురు.... వారిలో ఒక్కరే టై కట్టుకున్నారు. పంచె లాల్చీలతో వచ్చినవారు ఇరవై మందికి పైగా ఉన్నారు. వారిలో దాదాపు పదిమందికి భుజాలమీద కండువా లున్నాయి. కళ్ళజోళ్ళవారు పాతికమందికి పైగా ఉన్నారు. టోపీధరించిన వాడొక్కడే వున్నాడు. బహుశా తిరుపతివెళ్ళి వచ్చాడేమో!"

మిగిలినవారివి మామూలు షర్టులూ, ప్యాంట్లూ....

అంతలో అతన్నెవరో పలకరించారు. పక్కకు తిరిగి చూస్తే ఎర్రని, బక్క పలుచని, పొడవైన యువకుడు కనిపించాడు. అతని కళ్ళకు అద్దాలున్నాయి.

"ఇక్కడ దగ్గరలో కాఫీ దొరుకుతుందా?" అని అడిగా డతడు.

రవీంద్ర తలవూపి "నేనూ వస్తాను, పదండి"అన్నాడు ముందుకు నడుస్తూ.

కాలేజీకి ఎదురుగానే రోడ్డు కవతల ఉన్నదొక కుటీరం. లోపల నల్లనిరాతి బల్లలున్నాయి. ఇద్దరూ వెళ్ళి అక్కడ కూర్చుని కాఫీలు తెమ్మన్నారు.

"మీరు ఏ సబ్జక్టు?" అని అడిగాడతడు. బల్లమీద అతడు పెట్టిన ఫైలుమీద 'ఎస్. వైద్యనాథన్, ఎం.ఎస్.సి.' అని వ్రాసి వుంది.

"నాది తెలుగు" అని జవాబు చెప్పాడు రవీంద్ర.

వైద్యనాధన్ ఎందుకో అనవసరంగా చప్పరించాడు. తర్వాత అవులింత ఆపుకుని "మేమూ తెలుగువాళ్ళమే. కాకపోతే చాలా కాలంగా తమిళనాడులో ఉండిపోయాము. నాది జూఆలజీ, కొండంత ఆశ పెట్టుకుని ఇక్కడికి వచ్చాను. కాని...." అని ఆగాడు. బల్లమీదికి వచ్చిన కాఫీ అందుకుని నెమ్మదిగా ఒక్కగుటక వేశాడు. "కాని, ఇక్కడ అంతా ముందే అయిపోయినట్టు చెప్పుకుంటున్నారు. ఎవరో కాలేజీకి పాతిక వేల రూపాయలు విరాళం యిస్తానన్నారట, ఉద్యోగం.... యిస్తే అతనికే యిస్తారని విన్నాను."

రవీంద్ర "అంతే. ఇది అంతా ఒక తతంగం" అని నవ్వాడు.

అంతలో వారిద్దరి పక్కన మరో యువకుడు వచ్చి కూర్చున్నాడు. కుర్రవాణ్ణి పిలిచి "టీ యివ్వు .... వేడిగా ఉండాలి...." అని చెప్పి రవీంద్రతో "యీ డ్రామా పూర్తయ్యేసరికి చీకటిపడేలా వుందే...." అన్నాడు.

రవీంద్ర తలవూపి "ఇవాళ పూర్తి కాకపోవచ్చుకూడా, రేపటికి కొంత సశేషం ఉండవచ్చు" అన్నాడు.

ఆ యువకుడు అందంగా నవ్వాడు.

రవీంద్ర "మీదే సబ్జక్టు ?" అంటూ బల్లమీద ఉన్న ఫైలు అందుకున్నాడు. అతడు టీ చప్పరిస్తూ ఏమీ మాట్లాడలేదు. రవీంద్ర కాగితాలు తిరగవేశాడు. అతడి పేరు రామకృష్ణ పరమహంస .... మేత్స్ ఎం. ఏ. యూనివర్సిటీ సెకండ్. ప్రొఫెసర్లు యిచ్చిన టెస్టిమోనియల్స్ దండిగా, పుష్కలంగా ఉన్నాయి. నాలుగేళ్ళయింది పాసై.... రవీంద్ర, తల వంచుకుని టీ తాగుతున్న ఆ యువకుణ్ణి చూశాడు. అతడు నల్లగా ఉన్నా కళ్ళలో విచిత్రమైన కాంతి ఉంది. పెద్ద నుదురు.... అతి సాదా

దుస్తులు ధరించి వున్నాడు. చొక్కా భుజంమీద చిరిగితే కుట్టుకున్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నది.

వైద్యనాథన్ ఉన్నట్టుండి "ముందే అన్నీ నిర్ణయించుకున్నవాళ్ళు మనల్ని యిలా పిలిచి యాతన పెట్టడం దేనికి?" అన్నాడు. అతని గొంతు విచిత్రంగా ధ్వనించింది.

రామకృష్ణ పరమహంస టీ కప్పు బల్లమీద వుంచి నవ్వి "మీకు కొత్త అనుకుంటాను. నేను నాలుగేళ్ళనుంచి తిరుగుతున్నాను. చిన్నా పెద్దా అన్ని కాలేజీలూ, స్కూళ్ళూ తిరిగాను. మొదట్లో బాధగా ఉండేది. ఇప్పుడు మొద్దుబారిపోయాను. బతకడానికి కూలో నాలో ఏదో" ఒకటి చెయ్యక తప్పదు. అలా బతుకుతూ ఈ ప్రయత్నాలు కూడా కొనసాగించడం తప్పనిసరి...." అన్నాడు.

రవీంద్ర అతని ముఖంలోకి చూస్తూ మీకు వేరే ఉద్యోగం ఏదైనా వుందా?' అని అడిగాడు.

అతడు తల అడ్డంగా ఊపి "లేదు" అన్నాడు. అలాఅని "పోదాం, పదండి" అంటూ లేచాడు.

ముగ్గురూ ఇవతలికి వచ్చి మళ్ళీ కాలేజీ ఆవరణలో ప్రవేశించారు. ఒక నడివయసు తెలుగు అభ్యర్థి - ఈ ఇంటర్వ్యూల అనుభవంతో పండినవాడు నిరుద్యోగ సమస్యమీద తాను వ్రాసిన శార్దూలాలూ, మత్తేభాలూ చదివి వినిపించి చుట్టూచేరిన నలుగురైదుగురిని ఆనందింప జేస్తున్నాడు. కొత్త మిత్రులు ముగ్గురూ కాలేజీ ఆఫీసు ముందున్న ఇసుకలో కూర్చున్నారు. కూర్చుని కబుర్లలో పడ్డారు. ఇంటర్వ్యూలు జరిగేహాలు గుమ్మానికి పసుపుపచ్చని రంగు కర్టెన్ వ్రేలాడుతున్నది. అభ్యర్థులు వరండాలో అటూయిటూ తిరుగుతూ కొందరూ, కూర్చుని కొందరూ, పిలుపుకోసం నిరీక్షిస్తున్నారు. ముందు ఆడవారిని పిలుస్తున్నారు. ప్యూన్ కర్టెన్ తొలగించుకుని యివతలకి వచ్చి 'అలివేలుమంగ.... అలివేలుమంగ....' అని కేకపెట్టాడు. అవతల రూములో నుంచి ఎర్రని చీర కట్టుకున్న యువతి గాభరాగాలేచి త్వరత్వరగా లోపలికి వెళ్ళింది.

ఒక పొట్టి కుర్రవాడు - బహుశా కొత్తగా యూనివర్శిటీ చదువు ముగించుకుని వచ్చినవాడు - కళ్ళజోడు వ్రేలితో ముక్కుమీదికి వత్తు

కుంటూ వచ్చి ఇసుకలో కూర్చుని "మనల్ని ఏం ప్రశ్నలు వేస్తారండీ?" అని అడిగాడు.

రామకృష్ణ పరమహంస అతని వంక చూసి "ఏమైనా అడగవచ్చు ....ఉదాహరణకు మీరు తెలుగు ఎం. ఏ. అనుకోండి...." అని ఏదో చెప్ప బోయాడు.

అంతలో ఆ కుర్రవాడు అడ్డుతగులుతూ "అనుకోవడమెందుకు? నాది తెలుగే. ఈ సంవత్సరమే పాసయ్యాను. ఫస్టుక్లాసు.... అరవై పర్సెంటు...." అన్నాడు.

"అయితే మిమ్మల్ని ఐన్‌స్టీన్ థియరీ చెప్పమంటారు...." అన్నాడు పరమహంస. రవీంద్ర పెద్దగా నవ్వాడు. వైద్యనాధన్ కూడా నవ్వాడు. ఆ కుర్రవాడు తెల్లబోయాడు.

"అదేమిటి? నాకలాటివి తెలియవే." అని నసిగాడు.

రవీంద్ర నవ్వు ఆపుకుని "మీకు అది తెలియదని వారికి తెలుసు. అందుకే అడుగుతారు" అన్నాడు.

"ఏవిటో గొడవగా వుంది అంతా" అంటూ ఆ కుర్రవాడు లేచి వెళ్ళిపోయాడు. ముగ్గురికీ నవ్వు తెరలు తెరలుగా వచ్చింది.

ఫ్యాన్ కేక మళ్ళీ వినిపించింది. "శాంతకుమారి.... శాంత కుమారి...."

రవీంద్ర వైద్యనాధన్‌తో "మిమ్మల్ని చిన్నయసూరి వ్యాకరణం అడుగుతారు" అన్నాడు. వైద్యనాధన్ పొట్టపట్టుకుని నవ్వడం ప్రారంభించాడు.

పరమహంస "నన్ను? నన్నేమడుగుతారు? చెప్పండి...." అని అడిగాడు. రవీంద్ర ఒక్క క్షణం ఆలోచించి "ఆముక్తమాల్యదలో పద్యం ఒకటి యిచ్చి అర్థం చెప్పమంటారు" అన్నాడు.

వైద్యనాధన్ జోడు తీసి కళ్ళు తుడుచుకుంటూ "మరి మిమ్మల్ని?" అని అడిగాడు. రవీంద్ర తడుముకోకుండా "నన్ను హైబిస్కస్ కెనబైనస్ గురించి అడుగుతారు." అన్నాడు.

ఇక నవ్వులు ఆగిపోయాయి. నవ్వే ఓపిక లేక అలా కూర్చుండి పోయారు ముగ్గురూ. పరమహంస తన చెప్పులవంక చూసుకుంటూ "వీటి సర్వీసు అయిపోయింది" అన్నాడు.

"మరి యిన్ని ఇంటర్వ్యూలకు తిరుగుతుంటే చెప్పులు అరిగి పోవూ?" అన్నాడు రవీంద్ర.

"పూర్వం మునులు వాడే వారే.... చెక్క చెప్పులు.... అవిబెస్టు ...." అన్నాడు వైద్యనాథన్. మళ్ళీ వరండాలో ప్యూను కేక "వేదవతీ.... వేదవతీ...."

"పరమపద సోపానపటం ఒకటి తెచ్చుకుంటే సరిపోయేది. కాలక్షేపానికి."

మళ్ళీ నవ్వులు.

కాస్సేపాగి ఎవరో వచ్చారు. "మిగిలినవాళ్ళు మధ్యాహ్నం రెండు గంటలకు రండి" అని చెప్పారు.

ఆ వూరివారు నెమ్మదిగా సర్దుకున్నారు. పరాయి వూళ్ళనుంచి వచ్చినవారు భోజనానికి హోటలేదైనా దగ్గరలో ఉందేమో అని వాకబులు ప్రారంభించారు. రవీంద్ర "కాస్సేపేకదా! ఇక్కడే ఏదో యింత తిని కబుర్లు చెప్పుకుంటూ గడుపుదాం. ఈ భాగ్యానికి మళ్ళీ రిక్షాఖర్చులు యెందుకు దండుగ? బస్సులేమో గంటకొకటికానీ రావు" అన్నాడు.

ముగ్గురూ 'సరే అంటే సరే' అనుకుని బయటికి వచ్చారు. జూలై ఎండలో వేడిమి ఆట్టే లేకపోయినా చిటచిట లాడుతున్నది. సూర్యుడు కొత్తగా సంపన్నుడైన వాడిలాగా చిర్రుబుర్రు లాడుతున్నాడు. విపరీతంగా ఉక్కపోస్తున్నది.

హోటల్లో బల్లముందు కూర్చుని గడ్డంకింద చేయి ఆనించుకుని వైద్యనాథన్ గంభీరంగా "మా మదర్ యిది వింటే చాలా బాధపడుతుంది. నాకీసారి ఈ ఉద్యోగం వస్తుందని గట్టి ఆశలు పెట్టుకున్నది" అన్నాడు.

పరమహంస "మీరు బొత్తిగా ఆశ వొదులుకున్నట్టున్నారే. అది మంచిది కాదు. ఏమో! ఎవరు చూడొచ్చారు? మీరే సెలక్టు కావచ్చునేమో," అన్నాడు. వైద్యనాథన్ కళ్ళు ఒక్క క్షణం వెలిగాయి. కాని అది ఒక్క క్షణమే. ఆ వెంటనే నిట్టూర్చాడు.

రవీంద్ర ఏమీ మాట్లాడలేదు. ఇంటిదగ్గర ఎంత పొద్దుపోయినా తా నందించే శుభవార్త కోసం ఎదురుచూసే అక్కయ్య కళ్ళముందు నిలబడి నట్టయింది. అతని కళ్ళలో అకస్మాత్తుగా నీటిపొర కమ్ముకుంది. మిగిలిన యిద్దరూ అది గమనించకుండా రుమాలుతో తుడుచుకుంటున్నట్టు నటిస్తూ కళ్ళు తుడుచుకున్నాడు.

పరమహంస నెమ్మదిగా "నా కెవరూలేరు. ఒంటరివాణ్ని. ఇది వస్తే సంతోషమే. రాకపోయినా సంతోషమే. ఆశాలేదు. నిరాశాలేదు." అన్నాడు.

రెండు గంటల వేళకు కాలేజీ ఆవరణలో మళ్ళీ సంరంభం మొదలైంది. మళ్ళీ పిలుపులు, ఇంటర్వ్యూలు కొనసాగాయి.

ఈ ముగ్గురిలో ముందుగా పరమహంసకు పిలుపు వచ్చింది. అతడు లేచి వెడుతూవుంటే మిగిలిన యిద్దరూ "విష్ యు బెస్టాఫ్ లక్"... అన్నారు.

పరమహంస నవ్వుతూ వెళ్ళి అయిదు నిముషాలలోనే తిరిగి వచ్చాడు.

"ఏం జరిగింది? ఎలా జరిగింది?" అని అడిగాడు రవీంద్ర.

అతడు ఇసుకలో కూలబడుతూ "ఏముందీ? మామూలే. ఏ వూరు? ఏ కులం? వగైరా విచారణలు ముందు. ఆ తర్వాత కొంచెం సబ్జక్టు అంతే...." అని జవాబిచ్చాడు.

ఒక్కక్షణం ఆగి "మీరిద్దరూ వచ్చేదాకా వుంటాను. ఇప్పుడే వెళ్ళి చేసే ఘనకార్యం ఏమీలేదు. అందరం కలిసే పోదాం" అన్నాడు.

సమయం గడిచేకొద్దీ ఇంటర్వ్యూలు కురచ అయినాయి. రెండు మూడు నిముషాలు కూడా తీసుకోడంలేదు.

వైద్యనాథన్ వెళ్ళివచ్చి దిగాలుపడిన వాడిలా కూర్చున్నాడు. రవీంద్ర అడిగితే "వాళ్ళు నన్ను సబ్జక్టు ఏమీ అడగలేదు. ఇంతదూరం ఎందుకు వొస్తున్నావు? అక్కడ ఉద్యోగాలు లేవా? ఇదీ వరస" అని చెప్పాడు.

అయిదు గంటలు దాటిన తర్వాత రవీంద్ర వంతు వచ్చింది. అతడు నెమ్మదిగా లేచి వెళ్ళాడు.

హాలులోపల విశాలమైన బల్ల. దానిమీద ఖరీదైన అద్దం.... ఫ్లవర్ వాజులు. రకరకాల ఆఫీసు పరికరాలు. రివాల్వింగు కుర్చీలలో ఇంటర్వ్యూ చేసేవారు కూర్చుని వున్నారు. అందులో యిద్దరు దగ్గరదగ్గరగా కూర్చొని ఏదో విషయమై గంభీరంగా సమాలోచనలు సాగిస్తున్నారు. మిగిలిన ముగ్గురిముందూ గోల్డుస్పాట్‌లు ఉన్నాయి. ఒకాయన చేయిచాపి కూర్చొమని సైగ చేశాడు. రవీంద్ర అణకువగా కూర్చుని తన ఫైలు బల్లమీద ఉంచాడు. ఒక్కనిముషం నిశ్శబ్దం. రవీంద్ర ఈలోపల తన కెదురుగా గోడమీద వ్రేలాడుతున్న గాంధీ ఫొటోవంక చూస్తూ కూర్చున్నాడు. అకస్మాత్తుగా ఆశ్చర్యంతో కళ్ళు నులుముకుని మళ్ళీ చూశాడు. తను భ్రమపడ్డానేమో అని అనుకున్నాడు. కాని నిజంగానే ఫొటోలో గాంధీజీ కళ్ళక్రింద ముడుతలు ఉన్నాయి. ఉన్నట్టుండి చూస్తే గాంధీ కన్నీరు కారుస్తున్నట్టుగా కనిపిస్తాడు ఆ ఫొటోలో. అంతలో ఒకాయన తనను ఉద్దేశించి "ఇప్పుడేం చేస్తున్నావు?" అని అడిగాడు.

రవీంద్ర వినయంగా "ఏమీలేదండి" అన్నాడు.

ఆయన రవీంద్ర అప్లికేషన్ కాబోలు అటూ యిటూ తిప్పిచూసి అంతలో దాన్ని బల్లమీద పడేసి చేతివ్రేళ్ళు విరుచుకుని 'తర్వాత తెలియజేస్తాం' అని మాత్రం అన్నాడు. తర్వాత 'అప్పారావ్' అని కేకపెట్టి లిస్టులోకి చూస్తూ 'ప్రసాదరావు' అని తరువాతి అభ్యర్థి పేరు చెప్పాడు. ప్యూన్ వెళ్ళిపోయాడు.

రవీంద్ర లేచి ఆయనకు నమస్కారంచేసి కదిలాడు. అక్కడే ఆగి వెనుదిరిగి 'అయ్యా! ఈ ఉద్యోగం నాకు చాలా అవసరం. ఇది లేకపోతే బ్రతకలేను. దయతలచండి....' అని ప్రాధేయపడి చెప్పుకుందామా అనిపించింది. కాని అతడు ఆగలేదు. విసురుగా నడిచి కర్టెన్ తొలగించుకుని యివతలికి వచ్చాడు.

వైద్యనాథన్, పరమహంస యిద్దరూ అక్కడే నిలబడి వున్నారు. రవీంద్ర రాగానే కళ్ళతోనే ప్రశ్నించారు.

రవీంద్ర భుజాలెగరవేసి "పదండి, పోదాం. ఇంకెందుకిక్కడ?" అన్నాడు. అతని గొంతు అతనికే చిత్రంగా ధ్వనించింది.

ముగ్గురూ రోడ్డు మీదకి వచ్చి నడవటం ప్రారంభించారు. గాలి సన్నగా వీస్తున్నది.

వైద్యనాథన్ "రాత్రి పదకొండు గంటలకు బండి ఉంది. వెళ్ళిపోతాను" అన్నాడు.

"అన్నట్టు మీరెక్కడ దిగారు?"

"ఓ చిన్న లాడ్జిలో"

పరమహంస ఏమి మాట్లాడకుండా మౌనంగా నడుస్తున్నాడు. కొంచెం దూరం నడిచాక అతడు "నేనిటు వెళ్తాను. మాయిల్లు - యిల్లు కాదు లెండి ఒక పాతగది, మెలులోపే" అన్నాడు.

రవీంద్ర వైద్యనాథన్‌తో "మీకు ఇక్కడే బస్ ఆగుతుంది. టౌనుకు వెళ్ళవచ్చు. నేను నెమ్మదిగా నడిచి పోతాను." అన్నాడు.

ముగ్గురూ ఒకరినొకరు విడిచి వెళ్ళడం యిష్టం లేనివారిలా ఒక్క నిముషం సేపు అలా నిలబడిపోయారు. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. ఏమీ మాట్లాడాలనీ లేదు.

ఉన్నట్టుండి పరమహంస "రైట్. వస్తానండీ.... ఇంటర్వ్యూ కేంగాని, ఇవాళ మీ యిద్దరితో హాయిగా గడిచి పోయింది. థ్యాంక్స్" అని యిద్దరితోనూ కరచాలనం చేసి పక్కకు తిరిగి చకచక నడక సాగించాడు. చాలా సేపు ఆ యిద్దరూ త్వరత్వరగా నడిచిపోతున్న పరమహంస వంక నే చూశారు.

కొన్ని క్షణాల తర్వాత రవీంద్రకూడా వైద్యనాథన్‌తో చేయికలిపి "ఇక వెళ్తానండీ" అని చెప్పి నడవటం ప్రారంభించాడు.

వైద్యనాథన్ బస్‌కోసం అక్కడే నిలబడి పోయాడు ఒంటరిగా.

రవీంద్ర చాలా దూరం నడిచిన తర్వాత ఒక సినిమాహాలుముందు ఆగిపోయాడు. ఒక్క క్షణం ఆలోచనలో పడి, తర్వాత జేబులో డబ్బులు లెక్కచూసుకుని, హాల్లోకి నడిచాడు.

* * *

"ఇక్కడే ఆపు" అన్నాడు రవీంద్ర.

రిక్షా ఆగింది. వీధిలో సన్నటి వెన్నెల తప్ప వెలుతురు ఏదీలేదు. వీధి చివరివరకు రోడ్డుమీద గోడల, చెట్ల నీడలు పరుచుకుని వున్నాయి. రవీంద్ర రిక్షాదిగి ఎదురు గుమ్మం తలుపు తట్టి 'అక్కా అక్కా' అని

పిలిచాడు. వెంటనే నడివయసు స్త్రీ ఒకామె తలుపు తీసింది. తీస్తూనే "రవీ! ఏమైందిరా?" అని అడిగింది. ఆ కంఠస్వరంలో ఆత్రుత, ఆశ రెండూ ఒకే సారి ధ్వనించాయి.

"ఆ! ఏమవుతుంది. ఇంటర్వ్యూ అయింది. తర్వాత తెలియజేస్తామన్నారు. ముందు ఆ రిక్షా అతనికి ఒక ముప్పావలా యివ్వు!" అంటూ రవీంద్ర లోపలికి వెళ్ళాడు.

ఆమె కొద్ది క్షణాల్లో బయటికి వచ్చి రిక్షావాలా చేతిలో డబ్బులు పడేసి లోపలికి వెళ్ళిపోయింది. లోపల రవీంద్ర చొక్కా విప్పుతూ "ముప్పావలా తీసుకున్నాడా? ఏం పేచీ పెట్టలేదూ మరో పావలా యిమ్మని?" అని అడుగుతున్నాడు.

"ఏమీ అనలేదే మరి. అన్నట్టు చెప్పు ఎలా జరిగింది?" అంటున్నదామె.

"చెబుతాను, ఆకలేస్తున్నది, ముందు అన్నం పెట్టు" అంటున్నాడతడు. బయట రిక్షావాలా తలగుడ్డ తీసి విదిలించుకుని మళ్ళీ గట్టిగా తల చుట్టూ చుట్టుకున్నాడు. నెమ్మదిగా రిక్షాతిప్పుకుని ఎక్కి తొక్కడం ప్రారంభించాడు.

రెండు ఫర్లాంగుల దూరం వెళ్ళగానే అతనికి టీ తాగాలనిపించింది. ఒక లాడ్జి ముందు రిక్షా ఆపి పక్కనేవున్న 'గ్రాండ్ టీ సెంటర్'లో సింగిల్ టీ తాగాడు. తర్వాత చిల్లర డబ్బులిచ్చి యివతలికి వస్తుండగా లాడ్జి ముందునుంచి 'రిక్షా' అన్నకేక వినబడింది. త్వరత్వరగా రిక్షా లాక్కొని వెళ్ళాడు.

"స్టేషనుకు ఎంత యిమ్మంటావు?" అని చేతిలో చిన్న తోలు సంచితో నిలబడివున్న కళ్ళద్దాల, ఎర్రని, బక్కపలుచని పొడవైన యువకుడు.

"ఎక్కండి."

"ఎంత తీసుకుంటావో చెప్పు."

"మీయిష్టం.... ఎక్కండి."

"అర్ధరూపాయి యిస్తాను."

"సరే.... ఎక్కండి."

అతడు ఎక్కి కూర్చోగానే రిక్షా రివ్వున సాగిపోయింది. అయిదు నిమిషాలలో స్టేషను ఇవతల ఆగింది, రిక్షావాలా దిగి మొహం తుడుచు కుంటూ నిలబడిపోయాడు. ఆ వ్యక్తి క్రిందికి దిగి అర్థరూపాయ నాణెం అతని చేతిలో వుంచి గబగబ నడిచి స్టేషన్‌లోకి వెళ్లిపోయాడు.

* * *

తెల్లవారుజామున మూడు గంటలవేళ....

ఆసామీకి రిక్షా అప్పగించి అద్దె డబ్బుకట్టి మిగిలిన డబ్బు మొత్తం లెక్కపెట్టుకుంటే అయిదు రూపాయల యిరవై పైస లున్నాయి. వాటిని తన కాకీ రంగు పొట్టిలాగూ జేబులో వేసుకుని తలగుడ్డ తీసి మొహం తుడుచుకున్నాడు. తర్వాత దాన్ని భుజం మీద వేసుకున్నాడు. పలుచని వెన్నెల అందంగా, చల్లగా, హాయిగా వుంది. వేసవివెళ్ళి చాలా రోజులైనా ఎక్కడో యింకా ఒక కోయిల కూస్తున్నది. తర్వాత హుషారుగా ఈలవేస్తూ నడక సాగించాడు రిక్షావాలా.... ఉరఫ్ రామకృష్ణ పరమ హంస ఎం. ఏ.